
ఊరూరా దసరా సంబరం



ఎచ్చెర్లలోని ఏఆర్ కార్యాలయంలో ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

జిల్లావ్యాప్తంగా శనివారం దసరాను ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఆలయాలు, మండపాల్లో దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం వాహనాలకు పూజలు చేయించారు. పలు ప్రాంతాల్లో ఆదివారం బంధుమిత్రులను ఆహ్వానించి విందు భోజనం పెట్టారు. చెడుపై మంచి విజయానికి నాందిగా ప్రజలు దసరాను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాయుధ పోలీసు దళం కార్యాలయంలో ఆయుధాలు, వాహనాలకు పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రారంభించిన ప్రతి పని విజయవంతం కావాలని ఆకాంక్షించారు. డీఎస్పీలు రాజశేఖర్, ఎల్.శేషాద్రి, సీఐ ఇమాన్యుయల్‌రాజు, ఆర్ఐ నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సాంస్కృతికం



శ్రీకాకుళం నగరం నానుబాల వీధిలో చందన అలంకారంలో దర్శనమిచ్చిన విజయదుర్గాదేవి

నేడు మద్యం దుకాణాలకు లాటరీ



పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానంలో భాగంగా జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల లైసెన్సుల జారీకి సోమవారం లాటరీ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. 158 మద్యం దుకాణాలకు 4,671 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం 8 గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆబ్కారీ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు తెలిపారు. దరఖాస్తుదారులకు జారీ చేసిన ప్రవేశపత్రం, తగిన గుర్తింపు కార్డుతో హాజరు కావాలని సూచించారు. లాటరీలో దుకాణాన్ని దక్కించుకున్న వారు నిర్దేశించిన లైసెన్స్ ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని చెల్లించిన తరువాత ప్రొవిజనల్ లైసెన్స్ జారీ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా గతంలో ఇచ్ఛాపురం సర్కిల్ నుంచి లాటరీ ప్రారంభించే వారు. ఈసారి శ్రీకాకుళం నుంచి మొదలవుతుంది. ఆమదాలవలస, రణస్థలం, పొందూరు, నరసన్నపేట, కొత్తూరు, పాతపట్నం, టెక్కలి, కోటబొమ్మాళి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం సర్కిళ్లకు తీస్తారు. అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ నిర్వహణ ఏర్పాట్లను ఆబ్కారీ శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ తిరుపతినాయుడు ఆదివారం పరిశీలించారు.

ఆదిత్యుని ఆదాయం రూ.2.91 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పలువురు కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు మహిళలు ఇంద్రపుష్కరిణి వద్ద క్షీరాన్నం వడ్డి స్వామికి నివేదించారు. ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లలో తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.2.91 లక్షల ఆదాయం సమకూరింది. కేశఖండన శాలలో క్షురకులు భక్తుల నుంచి టికెట్ ధర రూ.40కు అదనంగా రూ.50 చొప్పున వసూలు చేశారు.

స్వచ్ఛమైన నీరు కనుమరుగు..

ఆరోగ్యం దేవుడెరుగు..!

- పథకాల శుభ్రతపై కొరవడిన పర్యవేక్షణ
- మురుగు కాలువల్లో పైపులైన్లు ఉన్నా చర్యలు శూన్యం

న్యూస్‌టుడే పరిశీలన

ఎచ్చెర్ల, టెక్కలి పట్టణం, హరిపురం (మందస), జి.సిగడాం, పొందూరు, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత నీరు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఎప్పటికప్పుడు ట్యాంకులు, పైపులైన్ల నిర్వహణ తీరు పర్యవేక్షించాల్సి ఉన్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వారానికి ఒకటి, రెండు సార్లు క్లోరినేషన్ చేసి తాగునీరు సరఫరా చేస్తున్న దాఖలాలు లేవు. రక్షిత నీటి పథకం ట్యాంకులను నెలకు ఒకసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలనే నిబంధన పాటించడం లేదు. కనీసం మూడు నాలుగు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయని దుస్థితి నెలకొంది. తిరిగి ఎప్పుడు చేస్తారనే వివరాలు ట్యాంక్‌పై అందరికీ కనిపించేలా రాయాల్సి ఉన్నప్పటికీ విస్మరిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండటంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. పలు మండలాల్లో రక్షిత నీటి పథకాల నిర్వహణ, తాగునీటి సరఫరా తీరును 'న్యూస్‌టుడే' పరిశీలించగా లోపాలు వెలుగు చూశాయి.



ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట రక్షిత నీటి పథకంలో పేరుకుపోయిన నాచు, మట్టి



ఏడాది నుంచి నిర్వహణ కరవు

ఎచ్చెర్ల మండలం డీమత్స్యలేశం పంచాయతీలో 4,500 మంది నివసిస్తున్నారు. ఐదు నెలల నుంచి పంచాయతీ కార్యదర్శి లేరు. ఇతర పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించినా ఎవరూ ముందుకు రాలేదు. ఏడాది నుంచి రక్షిత నీటి పథకం శుభ్రం/క్లోరినేషన్ చేయలేదని గ్రామస్థులు తెలిపారు. మరోవైపు ఈ పథకం మెట్లు శిథిలమయ్యాయి.

ఎప్పుడు శుభ్రం చేశారో..?

మందస మండలం సరియపల్లిలో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టుకు సంబంధించిన సంపు ఉంది. ఇక్కడి నుంచి సరియపల్లి, నాతుపురం బొడ్లూరు, పలాస మండలం గురుదాసుపురం గ్రామాల్లో నాలుగు వేల మందికి తాగునీరు సరఫరా అవుతుంది. మూడు నాలుగు నెలల నుంచి శుభ్రం/క్లోరినేషన్ చేయలేదు. గతంలో ఎప్పుడు చేశారు? తిరిగి ఎప్పుడు చేస్తారనే వివరాలు ట్యాంక్‌పై లేవు.





పైపులైన్లు.. పట్టించుకోండి

పొందూరు మండలం రాపాకలో తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నాయి. చాలా వీధుల్లో ఇదే పరిస్థితి ఉండటంతో స్వచ్ఛమైన నీరు ఎలా సరఫరా అవుతుందని గ్రామస్థులు ఆక్షేపించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు.



బురద నీరే దిక్కు

టెక్కలి మండలం రావివలసలో 3,500 మంది నివసిస్తున్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ వేసిన కుళాయిల నుంచి గత నాలుగు నెలల నుంచి బురద నీరు వస్తోందని.. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



క్లోరినేషన్‌కు దూరం

జి.సిగడాం మండలం ఆనందపురంలో 1,250 మంది నివసిస్తున్నారు. రక్షిత నీటి పథకం ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు తుప్పు పట్టి కూలే దశలో ఉన్నాయి. గత ఏడాది నుంచి ట్యాంక్‌ను శుభ్రం/క్లోరినేషన్ చేయలేదు. శుభ్రం చేయకుండా నీరు సరఫరా చేస్తుండటంతో తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..: గ్రామాల్లో రక్షిత నీటి పథకాల నిర్వహణ బాధ్యతను జిల్లా పరిషత్తు, పంచాయతీలు పర్యవేక్షిస్తాయి. సాంకేతికంగా గ్రామీణ నీటి సరఫరా విభాగం సహకారం అందిస్తుంది. క్షేత్రస్థాయిలో ట్యాంకులు, పైపులైన్లను పరిశీలిస్తాం. నిబంధనల మేరకు చర్యలు తీసుకుని గ్రామీణ ప్రజలకు సురక్షిత నీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

- బాషా, ఎస్ఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, శ్రీకాకుళం

- జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ పరిధి గ్రామాలు 4,037
- తాగునీరు అందుతున్నవి 1,516
- పాక్షికంగా సరఫరా 2,519
- చేతి పంపులు 16,210
- ఎన్టీఆర్ సుజల పథకాలు 25
- 38 సమగ్ర రక్షిత నీటి పథకాల ద్వారా 1,046 గ్రామాలకు; 1,075 రక్షిత నీటి పథకాల ద్వారా 1,075 గ్రామాలకు, 205 చిన్న రక్షిత నీటి పథకాల ద్వారా 205 గ్రామాలకు, 440 గ్రామాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీరు సరఫరా అవుతోంది.

చెత్త పన్నుకు చెల్లుచీటీ..!

ప్రజలపై ఆర్థిక భారాన్ని తప్పించిన ప్రభుత్వం

జలుమూరు, నరసన్నపేట, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో ప్రవేశపెట్టిన చెత్త పన్ను ఆర్థికంగా భారం కావడంతో ప్రజల నుంచి నిరసన వెల్లువెత్తింది. గత పాలకులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కొనసాగించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హామీ ఇచ్చిన మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రద్దు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ప్రకటన చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి రూ.730 మిగులు

వైకాపా ప్రభుత్వం చెత్త పన్ను రూపంలో పల్లెలు, పట్టణాల్లో ప్రతి ఇంటి నుంచి రోజుకు రూ.2 వసూలు చేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం దీన్ని రద్దు చేయడంతో ఏడాదికి రూ.730 మిగిలినట్లే.



సంపద కేంద్రాలు నిర్వీర్యం

వైకాపా అధికారం చేపట్టిన తరువాత ఇంటింటా చెత్త సేకరణ ప్రారంభించారు. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తామని చెప్పి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ వంకతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణను పట్టించుకోలేదు. 2014-19 మధ్య తెదేపా హయాంలో స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దడానికి ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణం చేపట్టింది. పంచాయతీకి ఇద్దరు చొప్పున హరిత రాయబారులను నియమించి స్వచ్ఛభారత్ మిషన్ నుంచి నెలకు రూ.6 వేలు గౌరవ వేతనం వారి ఖాతాలకే జమ చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక 2022 అక్టోబరు నుంచి వారి వేతనాల భారం పంచాయతీలపై పడింది. 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల నుంచి కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. సకాలంలో నిధులు రాక.. వారికి జీతాలు అందక స్వచ్ఛ గ్రామాల లక్ష్యానికి తూట్లు పొడిచింది. కూటమి ప్రభుత్వం సంపద సృష్టి కేంద్రాలను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలపై భారం పడకూడదనే..

పేదలపై పన్ను బారం పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసింది. పారిశుద్ధ్య కార్యక్రమాలు సజావుగా సాగడానికి పంచాయతీల నుంచే హరిత రాయబారులకు వేతనాలు చెల్లిస్తున్నాం. అన్ని పంచాయతీల్లో సేకరించిన తడి, పొడి చెత్త నుంచి సంపద సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. **– ఆర్.గోపీబాల, డీఎల్‌పీవో, టెక్కలి**

ఇది ప్రమాదాన్ని ఆపగలదా?

నరసన్నపేట ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలోని పాత జాతీయ రహదారి అభివృద్ధి పనులు గతేడాది పూర్తయ్యాయి. రద్దీగా ఉండే ప్రాంతంలో రహదారి మధ్య ఐదు అడుగుల లోతున రంధ్రం పడింది. రాత్రి వేళ ప్రమాదాలు జరగకుండా స్థానికులు కర్ర పాతి దానిపై గోనె సంచి వేశారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా గొయ్యిని పూడ్చి రహదారిపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

–న్యూస్‌టుడే, నరసన్నపేట



డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామకాలకు ఉద్దేశించిన డీఎస్సీ రాత పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు విశ్వమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

నేటి నుంచి పల్లె పండగ

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజున గ్రామసభలు నిర్వహించి పంచాయతీ వ్యవస్థలో జవసత్వాలు నింపేందుకు అడుగులు వేసింది. ఆ వ్యవస్థతోనే అభివృద్ధి సాధ్యమని నిరూపించడానికి 'పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు' పేరిట కార్యక్రమం నిర్వహించనుంది. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు భూమిపూజ చేయనున్నారు. వాటిని యుద్ధప్రాతిప్రదికన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. రూ.261 కోట్లతో 3,471 పనులు చేపట్టాలని నిర్ణయించారు.

షెడ్యూలు ఖరారు..

ప్రతి నియోజకవర్గంలో ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండగ పేరిట కార్యక్రమాలు నిర్వహించడానికి షెడ్యూల్ ఖరారు చేశారు. సీసీ, బీటీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులతో చేపట్టనున్నారు. రోడ్లను పంచాయతీరాజ్, కాలువల పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షించేలా ప్రభుత్వం పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని ఐదుగురు జిల్లా అధికారుల బృందం పర్యవేక్షించనుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.



శ్రీకాకుళం గ్రామీణ మండలం తండెంవలసలో సీసీ రోడ్డు నిర్మాణానికి గుర్తించిన మట్టి దారి

రహదారులు, కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో 'పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాం. పంచాయతీల్లో ప్రజల అవసరాల మేరకు రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టనున్నాం. త్వరితగతిన పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశాం.

- బి.సుధాకర్‌రావు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

పాఠశాల విద్య ప్రక్షాళన..!

- మండలానికి ఒకరే ఎంఈవో
- పాఠశాల సముదాయ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు



కంచిలి మండలం పి.కొజ్జిరియా ఉన్నత పాఠశాల ఏడో తరగతిలో ముగ్గురే విద్యార్థులు

గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో అస్తవ్యస్తంగా మారిన పాఠశాల విద్య ప్రక్షాళనకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. మండల స్థాయిలో వివిధ అంశాలపై వివరాలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే కొన్ని నూతన విధానాలను అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. విలీన తరగతులను వెనక్కి పంపడం వంటివి వచ్చే ఏడాది నుంచి అమలులోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, సోంపేట, పోలాకి

గత ప్రభుత్వ హయాంలో మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించడంతో ఆధిపత్య పోరు నెలకొంది. పాత విధానంలో మాదిరిగా ఒక ఎంఈవోను కొనసాగిస్తూ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కీలక బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాల సముదాయాలను నవీకరించనున్నారు. ఒక్కో సముదాయ పరిధిలో 50 మంది ఉపాధ్యాయులు ఉండేలా చూస్తున్నారు మండలానికి 10 నుంచి 12 వరకు ఉన్న సముదాయాల సంఖ్య సగానికి తగ్గుతుంది. నిర్దేశిత సంఖ్యలో ఉపాధ్యాయులు సముదాయాలకు హాజరైతే బోధన, ఇతర అంశాలపై చర్చ, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన తరగతులకు అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు ఉండటంతో నామమాత్రంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీన్ని ప్రక్షాళన చేయడానికి అవసరమైన కసరత్తు పూర్తి చేశారు. ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ, ఇతర బాధ్యతలను సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అప్పగించనున్నారు. పాఠశాల సముదాయ ఛైర్మన్‌గా వ్యవహరించే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును అధ్యయనం చేసి కలెక్టర్ ఆధ్వర్యంలో మెనూ రూపొందిస్తారు.



పోలాకి మండలం తెల్లవానిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినికి బోధిస్తున్న ఉపాధ్యాయుడు

విలీన తరగతులు వెనక్కి..

వీలినం పేరిట జిల్లాలో 223 పాఠశాలల నుంచి విద్యార్థులను వేరే బడులకు పంపడంతో ప్రాథమిక పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వం నిర్వాకంతో 485 పాఠశాలల్లో 10 మంది లోపు విద్యార్థులు ఉన్నారు. అందులో ఒకరిద్దరు పిల్లలున్న పాఠశాలలు అధికంగా ఉన్నాయి. ఒకటి, రెండు తరగతులకు పరిమితమైన పాఠశాలల్లో కొత్తగా పిల్లలు చేరే పరిస్థితి లేకుండా పోయింది. మూడో తరగతికి వస్తే మరో బడికి పంపాల్సి ఉండటంతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపడానికే మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి కొత్త విధానం తీసుకురానున్నారు. మరోవైపు ప్రాథమిక పాఠశాలలకు 5 కి.మీ. దూరంలో ఉన్నత పాఠశాల లేని చోట్ల మాత్రమే ప్రాథమికోన్నత బడిని కొనసాగించాలని చర్చిస్తున్నట్లు సమాచారం. పంచాయతీకి ఓ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలనే యోచన చేస్తున్నారు.

జీవో 117 రద్దు చేయాలి..

3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలకు పంపించాలి. జీవో 117 రద్దు చేయాలి. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి అమలు చేయాలి. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి బోధనకు అవకాశం కల్పించాలి.

- ఎస్.చాణక్య, జిల్లా కార్యదర్శి, ఏపీటీఎఫ్

రెండంచెల విధానం మంచిదే..

ప్రభుత్వం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్ని మాత్రమే నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తే ప్రాథమిక విద్య గాడిన పడుతుంది. ఎక్కువ మంది పిల్లలున్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలి. దూర ప్రాంతం నుంచి ఉన్నత పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లించాలి.

- లండ బాబూరావు, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి

విలీన తరగతులను వెనక్కి పంపడం ద్వారా గ్రామీణ బడి పరిస్థితి మెరుగుపడుతుంది. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు పేరిట పట్టణాల్లో బడులను తగ్గిస్తే విద్యార్థులు ఇబ్బంది పడతారు. పాఠశాల విద్య ప్రక్షాళనకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తు విషయంలో అందరి అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకోవాలి.

- రమేష్‌కుమార్ పాణిగ్రహి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీఆర్టీయూ

- జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,915
- ప్రాథమికోన్నత 315
- ఉన్నత 419
- విలీనం చేసినవి 223
- పది మంది లోపు ఉన్నవి 485
- విద్యార్థులు 1.60 లక్షలు



సాహిత్య నిలయం.. ఆధ్యాత్మిక సంబరం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి పండగ మరోవైపు విజయనగరం సంబరాలు ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి తొలేళ్లు నిర్వహించనున్నారు.

6 లో



ఎచ్చెర్ల: శ్రీ చక్రపురంలో సామూహిక కుంకుమపూజలు..



కోటబొమ్మాళి: దేవి నిమజ్జనంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

దుర్గాదేవి ఆలయాలు, మండపాలు, దేవీ పీఠాల్లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శరన్నవరాత్రి మహోత్సవాలు మహా పూర్ణాహుతి పూజలతో ముగిశాయి. దసరా సందర్భంగా ఆలయాలు భక్తులతో కళకళ లాడాయి. దుర్గమ్మ విగ్రహాలను శనివారం ఊరేగించి ఘనంగా నిమజ్జనం చేశారు. నిమ్మాడ గ్రామంలో భవానీ ఊరేగింపులో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు హరిప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొనగా, మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజయదశమి సందర్భంగా రణస్థలంలోని తన నివాసం వద్ద సైకిల్‌కు పూజ చేసి సతీసమేతంగా కొంత దూరం ప్రయాణించారు. రాజకీయంగా తాను ఉన్నత స్థానానికి చేరుకోవడానికి కారణమైన సైకిల్‌కు పూజలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. - న్యూస్‌టుడే, బృందం



శ్రీకాకుళం సాంస్కృతికం: కత్తెరవీధి రాజరాజేశ్వరీ దేవి పీఠంలో నృత్య ప్రదర్శన

వెళ్లిరా.. దుర్గమ్మ



కోటబొమ్మాళి: కుటుంబ సభ్యులతో మంత్రి అచ్చెన్నాయుడు



ఎచ్చెర్ల: సైకిల్‌పై సతీసమేతంగా ప్రయాణిస్తున్న ఎంపీ కలిశెట్టి



ఇచ్ఛాపురం: అమ్మ విగ్రహానికి నిమజ్జనోత్సవం





శ్రీకాకుళం సాంస్కృతికం: బలగ కాలభైరవాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్..

ఘనంగా లక్ష తులసీ దళార్చన

జలుమూరు మండలం జోనంకి పంచాయతీ అబ్బాయిపేటలోని మురళీకృష్ణస్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసీ దళార్చన ఘనంగా జరిగింది. ఆశ్వయుజ మాసం శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. గత కొంత కాలంగా ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తుంది. కూనలచ్చన్నాయుడుపేట, గంగాధరపేట గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అన్న సంతర్పణ నిర్వహించారు. - న్యూస్‌టుడే, జలుమూరు





సిరులతల్లి.. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి జాతర నేడు ప్రారంభం కానుంది. తొలి రోజు సోమవారం రాత్రి తొలేళ్లు జరగనున్నాయి. మంగళవారం సిరిమానోత్సవం సాగనుంది. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం భక్తులు దర్శనాలకు తరలివచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల వారు ఘటాలతో మొక్కులు చెల్లించారు.

- న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, కంటోన్మెంట్, రింగురోడ్డు, అయ్యన్నపేట, కోట

సాహిత్య నిలయం.. ఆధ్యాత్మిక సంబరం



తల్లి సేవలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు అదితి, గొండు శంకర్, ఎంపీ కలిశెట్టి



కాంతులీనుతున్న వనంగుడి



మూడులాంతర్లు సమీపంలో బారికేడ్ల ఏర్పాటు

దేవుడా.. ఏమిటీ పరీక్ష



అరసవల్లి సూర్య భగవానుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఇంద్రపుష్కరిణిలో కలుషితమైన జ్ఞనీరు చూసి అసహనం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు నిర్వహణపై మండిపడ్డారు. నీరు దారుణంగా ఉందని స్నానాలు చేసిన వారు ఆవేదన వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

డెంగీ లక్షణాలతో మహిళ మృతి

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని మాతల పంచాయతీ పెనుగోటివాడ గ్రామానికి చెందిన కిలారి రాధ(32) డెంగీ లక్షణాలతో ఆదివారం మృతి చెందారు. జ్వరంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొత్తూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్య సేవలు పొందుతున్న సమయంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం, జ్వరం నయం కాకపోవడంతో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్ను మూశారు. భర్త లక్ష్మీనారాయణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి స్వగ్రామం సరుబుజ్జిలి మండలం సవలాపురం కాగా గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో జీడి తోటలు కొనుగోలు చేసి జీవనం సాగిస్తూ పెనుగోటివాడలో స్థిరపడ్డారు.

ప్రజా సమస్యలపై పోరాడతాం

గార, న్యూస్‌టుడే: వైకాపాకు 40శాతం ఓటు బ్యాంకు ఉందని, రానున్న రోజులు ప్రజా సమస్యలపైన పోరాటం సాగిస్తామని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రం గారలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావును ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అబద్ధపు హామీలు ఇవ్వడం.. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం చంద్రబాబుకే సాధ్యమని విమర్శించారు. వంద రోజులు పాలనలో ఆర్భాటం తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, గార సర్పంచు మార్పు పృథ్వీరాజ్, జడ్పీటీసీ మార్పు సుజాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

రామారావు మృతి తీరనిలోటు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంబాన రామారావు మృతి మాదిగల హక్కుల పోరాట సమితికి తీరని లోటని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామారావు కుటుంబ సభ్యులను మంద కృష్ణ మాదిగ ఆదివారం సాయంత్రం గొల్ల కంచిలిలో పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మట్లాడుతూ మాదిగ సమాజానికి ఎన్నో సేవలందించిన రామారావు మృతిచెందడం బాధాకరమని, ఆయన కుటుంబాన్ని అన్ని విదాల ఆదుకుంటామని పేర్కొన్నారు. ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు డా.నాగరాజు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంద కృష్ణ మాదిగ

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

పండగ వేళ.. మృత్యుహేల

పండగ వేళ ఆ ఇళ్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మనస్తాపంతో ఆయువు తీసుకున్న వారు ఒకరైతే.. రోడ్డు ప్రమాదం ఓ పచ్చని కాపురాన్ని చిదిమేసింది. అంతవరకు తండ్రితో ఉన్న బాలుడిని చెరువు బలి తీసుకుంటే, ఓ వివాహిత అనుమానాస్పద మృతి తీరని శోకంలో ముంచేసింది. కుమార్తె పెళ్లి పత్రిక పంచేందుకు వెళ్తున్న వ్యక్తిని మృత్యు పాశం వెంటాడింది.

వివాహిత అనుమానాస్పద మృతి



రేవతి (పాత చిత్రం)

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం తెనిగపెంట గ్రామానికి చెందిన పెంట రేవతి (19) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ నెల 6న గ్రామంలోని పాఠశాల సమీపంలోని బావిలో ఆమె మృతదేహం బయటపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హత్య చేసి బావిలో పడేశారా.. ఆత్మహత్య చేసుకున్నారా.. తెలియాల్సి ఉంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేవతికి అదే గ్రామానికి చెందిన పెంట లక్ష్మయ్యతో గతేడాది వివాహం జరిగింది. ఈనెల 4న అర్ధరాత్రి లక్ష్మయ్య, కుటుంబ సభ్యులు రేవతి కనిపించడం లేదని ఆమె పిన్ని దొణాల దుర్గమ్మకు చెప్పడంతో అంతా కలిసి గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసుగా నమోదు చేశారు. 6వ తేదీ ఉదయం పాఠశాల సమీపంలోని బావి వద్దకు తాగునీటికి వెళ్లిన గ్రామస్థులకు మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంతబొమ్మాళి ఇన్‌ఛార్జి ఎస్సై నారాయణస్వామి, టెక్కలి సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అల్లుడు లక్ష్మయ్య, వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రి వరకు ఫోన్ మాట్లాడుతుండగా మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయి ఆత్మహత్య చేసుకుందని భర్త లక్ష్మయ్య సంతబొమ్మాళి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నారాయణస్వామి తెలిపారు.

దేవుడికి కన్నుకుట్టిందేమో..



నాయిని చంటి

ఎచ్చెర్ల(లావేరు), న్యూస్‌టుడే: ఏడాదిన్నర కిందటే ఆ జంటకు వివాహమైంది. వారి ఆనందాన్ని మృత్యువు చూడలేకపోయింది. విజయదశమి రోజు ఉదయం ద్విచక్ర వాహనం రూపంలో యువకుడి ప్రాణాలు బలిగొంది. అతని భార్య ప్రస్తుతం మూడో నెల గర్భిణి. లావేరు ఎస్సై లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం కేశవరాయనపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాయిని చంటి (26) శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. టిఫిన్ కోసం తన గ్రామం నుంచి మురపాకకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతను ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు, బంధువులు గమనించి శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది. లావేరు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాజుపెంకులు కడుపులో గుచ్చుకుని యువకుడి మృత్యువాత



సవర సురేష్

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మెళియాపుట్టి మండలం సవర మురికింటిభద్ర గ్రామానికి చెందిన యువకుడు సవర సురేష్(28) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సురేష్ భరణికోట నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ఆ సమయంలో పెట్రోల్ ట్యాంకుకు డ్రైవింగ్ సీటుకు మధ్యలో ఉన్న మద్యం సీసాలు రోడ్డుపై పడి గాజుముక్కలు కడుపులో గుచ్చుకున్నాయి. తీవ్ర గాయాల పాలైన సురేష్‌ను అటుగా వచ్చిన వ్యక్తి గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. అప్పటికే సురేష్ మృతి చెందాడు. పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో..



అరుణ కుమారి (పాత చిత్రం)

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచిలి మండలం పద్మతుల గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. అదే గ్రామానికి చెందిన పులి లక్ష్మీనారాయణ, అరుణకుమారి (27) భార్యాభర్తలు. క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నారాయణ మద్యానికి బానిసైన భార్యను వేధిస్తుండేవాడు. మనస్తాపానికి గురైన ఆమె శనివారం రాత్రి ఇంటి పెరట్లోకి వెళ్లి శరీరంపై డీజిల్ పోసుకుని ఆత్యహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన సోంపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం బ్రహ్మపుర తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. మృతిరాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్షణాల్లో గుండెకోత



త్రినాథ్

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: చెరువులో పడి బాలుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. కన్న తల్లి రోదన అందర్నీ కంటతడి పెట్టించింది. కొత్త అంపురం గ్రామానికి చెందిన మద్ది నీలయ్య కుమారుడు త్రినాథ్ (12)తో కలిసి ట్రాక్టరును నీటితో శుభ్రం చేయడానికి ఊరి చివరనున్న కొత్తచెరువు వద్దకు శనివారం ఉదయం వెళ్లారు. ఈ క్రమంలో బాలుడు నీటి కోసం చెరువులోకి దిగి కాలుజారి చెరువులో పడిపోయాడు. గమనించి బాలుడి తండ్రి కేకలు వేయడంతో గ్రామస్థులు చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి మృతదేహాన్ని బయటకు తీసుకుని వెంటనే సోంపేట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే త్రినాథ్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కంచిలి ఎస్సై జి.రాజేష్ తెలిపారు.

పెళ్లింట విషాదం



రుంకు మోహనరావు

టెక్కలి, న్యూస్‌టుడే: పెళ్లి ఇంట విషాదం చోటు చేసుకుంది. కుమార్తె వివాహ వేడుకకు సంబంధించి బంధువులకు శుభలేఖలు అందజేసేందుకు వెళ్తున్న వ్యక్తిని మృత్యువు వెంటాడింది. టెక్కలి మండలం శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన రుంకు మోహనరావు(45) ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే కుమార్తె హిమ వివాహం ఈ నెల 20న జరగాల్సి ఉంది. దానికి సంబంధించి, శుభలేఖలను ఇచ్చేందుకు పక్క గ్రామమైన విక్రంపురం వెళ్తున్నారు. గ్రామం సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా లారీ ఢీకొనడంతో గాయపడ్డారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య మాలతి, కుమారుడు చరణ్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగి.. చెరువులోకి జారి

తుళ్లూరు, న్యూస్‌టుడే: చెరువులో పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం గుంటూరు జిల్లా తుళ్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శ్రీకాకుళం జిల్లాకు చెందిన సురపు రామకృష్ణ (36) కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటూ గ్రామాల్లో కాంక్రిట్ స్లాబ్ పనులు చేస్తూ ఉంటారు. శనివారం మద్యం తాగి ప్రమాదవశాత్తు అయ్యన్న చెరువులో జారి పడ్డారు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటనపై తుళ్లూరుకు చెందిన తాపీమేస్త్రి బురుసు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సి.ఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆటకు ఆయువు పోయాలి

- జిల్లాలో క్రీడా మైదానాలు, పరికరాల కొరత
- సరైన శిక్షణ లేక వెనకబాటు

క్రీడావికాస కేంద్రాలు: ప్రస్తుతం మన జిల్లాలో ఆమదాలవలస, టెక్కలి, పాతపట్నంలో మాత్రమే వికాసకేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. పలాస, ఇచ్ఛాపురం తదితర చోట్ల ఇండోర్‌స్టేడియంలు అసంపూర్తిగా దర్శనమిస్తాయి. పలాసలో వికాసకేంద్రానికి స్థలం కేటాయించాల్సి ఉంది.

మైదానాలు: జిల్లాలో చాలా పాఠశాలల్లో మైదానాలు లేవు. దీంతో క్రీడాసాధనకు ఇబ్బందితో పాటు రాష్ట్ర, జాతీయ పోటీల నిర్వహణ కూడా కష్టతరమవుతుంది. ఉదాహరణకు వజ్రపుకొత్తూరులో మైదానం లేనందున గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలను పాఠశాల ఆవరణతోపాటు ప్రైవేటు స్థలంలో నిర్వహించారు. కొత్తపల్లి, అంబుగాం(మందస), మామిడిపల్లి (సోంపేట), బూరగాం(కంచిలి), పెద్దతామరాపల్లి (నందిగాం), సీతాపురం(టెక్కలి).. ఇలా పలు చోట్ల మైదానాలు లేవు. అలాగే పలాసలో 400ట్రాక్ లేనందున గతంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగిన సందర్భంలో ప్రైవేటు స్థలంలో ట్రాక్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

శిక్షకులు: అథ్లెటిక్స్‌కు శిక్షకుడు ఉన్నప్పటికీ ఆయనే జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ముఖ్యశిక్షకునిగా ఉండడంతో పరిపాలనా వ్యవహారాలు చూడాల్సి రావడంతో పూర్తిస్థాయిలో శిక్షణకు అవకాశం లేకుండా పోయింది. అలాగే బాక్సింగ్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, హాకీ, తైక్వాండో, జూడో, హ్యాండ్‌బాల్, కబడ్డీ, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్ వంటి క్రీడలకు శిక్షకులు పొరుగుసేవల ప్రాతిపదికన ఉన్నారు. వీరికి ఉద్యోగభద్రత కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి.



ట్రాక్ లేని పలాస క్రీడామైదానం

న్యూస్‌టుడే, పలాస క్రీడలు

విశ్వక్రీడావేదికపై తెలుగు క్రీడా పతాకను రెపరెపలాడించాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. గతంలో ఒలింపిక్స్ పతకాన్నే సొంతం చేసుకున్న క్రీడల ఖిల్లా సిక్కోలు.. దీనిని అవకాశంగా తీసుకోవాలి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న మైదానాలు, శిక్షకులు, క్రీడాప్రాంగణాలు, క్రీడావసతి గృహాలు, పరికరాలు ఇతర సౌకర్యాలతోపాటు అవసరమైన వసతుల సమాహారంతో కథనం



వజ్రపుకొత్తూరులో ప్రైవేటు స్థలంలో రాష్ట్రపోటీల నిర్వహణ (పాతచిత్రం)

400 మీటర్ల ట్రాక్ ఏర్పాటు చేయాలి

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆటల్లో ప్రాథమిక శిక్షణా పద్ధతులకు కూడా నేడు 400మీటర్ల ట్రాక్ అవసరం. కానీ మన జిల్లాలో శ్రీకాకుళంలో తప్ప మరెక్కడా ఈ ట్రాక్ లేదు. దీంతో సాధనతో పాటే రాష్ట్ర, జాతీయ పోటీల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ట్రాక్ ఏర్పాటు వల్ల నైపుణ్యంతో పాటు విజయాలూ సొంతమవుతాయి.

- కె.హరిబాబు, రాష్ట్ర సాంకేతిక కమిటీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ సంఘం

పరికరాలతో రాటుదేలుతారు

జిల్లాలో అన్ని క్రీడాంశాలకు క్రీడాపరికరాలు కొరత తీవ్ర సమస్యగా పరిణమించింది. ఇప్పటికీ మన జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలంటే ఇతర జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్ వంటి క్రీడల పరికరాలు వ్యయం భారంగా మారింది. ప్రభుత్వం పరికరాలు అందిస్తే క్రీడాకారుల్లోని నైపుణ్యత వెలుగులోకి వస్తుంది.

- పి.తవిటయ్య, జాతీయ కార్యవర్గ సభ్యుడు, టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

వసతిగృహాలు.. అకాడమీలు: మన జిల్లాలో 1990- 2005 మధ్య ఉన్న క్రీడా వసతిగృహాలు, అకాడమీలలో నిరంతరం శిక్షణ సాగేది. కానీ నేడు అవేవీ లేవు. ఇంతటి క్రీడాప్రతిభ ఉన్న ఈ జిల్లాలో మళ్లీ వాటిని నెలకొల్పాలి.

వ్యాయామ ఉపాధ్యాయులు: 2022లో 117 ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం.. 92 మంది విద్యార్థులు కంటే తక్కువ ఉన్న పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు, వ్యాయామవిద్య ఉపాధ్యాయులను తొలగించడం జరిగింది. దీంతో మన జిల్లాలో ఇలాంటి 40 స్కూళ్లకు పీఈటీలు లేని పరిస్థితి ఏర్పడింది..

బయట నుంచి రావాల్సిందే: రాష్ట్రవిభజన తర్వాత జిల్లాలో ఇంతవరకూ పూర్తిస్థాయిలో నాణ్యమైన క్రీడాపరికరాలు లేని పరిస్థితి ఉంది. రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాలంటే ఇతర జిల్లాల నుంచి పరికరాలను తీసుకు రావాల్సిందే.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	: 9440437129
పలాస	: 8008574279
కవిటి గ్రామీణం	: 8309638875
పలాస గ్రామీణం	: 7386408926
కంచిలి గ్రామీణం	: 9704568738

సమస్య : ఇచ్ఛాపురం పట్టణం చిన్నమేదరవీధిలో చెత్త తొలగించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.
–వెచ్చా కేశవరావు, ఇచ్ఛాపురం

సమాధానం : సమస్య పరిష్కరిస్తాం.
-పి.ఉపేంద్రకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సమస్య: పలాస మండలం కేదారిపురంలోని జగనన్న కాలనీకి సరైన రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం: స్థానికులు

సమాధానం: రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయి. త్వరలోనే నిర్మాణం చేపడతాం:
వైకుంఠరావు, హౌసింగ్ ఏఈ, పలాస గ్రామీణం
న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

పలాస క్రీడలు: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కుప్పిలి నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వెంటనే కళాశాలలో వారి పూర్తి వివరాలతో పత్రాలను సపర్పించాలన్నారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు జరగనున్న ముఖాముఖి పరీక్షకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

వాహనాలు ఢీ: యువకుడికి గాయాలు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం, కారు ఢీ కొన్న ఘటనలో ఒకరికి గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు. . కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి చెందిన వజ్జ త్యాగరాజు (52) అతడి భార్యతో కలిసి జాడుపూడిలో శనివారం జరిగిన అన్నసమారాధన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం గ్రామానికి తిరిగి వెళ్తుండగా పెద్దఖొజ్జిరియాకి వెళ్తున్న బీటీ రోడ్డులో టింబర్ వద్ద ఓ కారు వెనుక నుంచి అతి వేగంగా వచ్చి బలంగా ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు త్యాగరాజుకు గాయాలు కాగా ఆయన భార్య క్షేమంగా బయటపడింది. బాధితుణ్ని స్థానికులు హుటాహుటిని సోంపేట సామాజికాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. త్యాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు దుర్గారావు, హరీశ్‌కుమార్, శ్రీకాంత్

పైవంతెనకు నిధులు మంజూరు చేయాలి

పలాస, న్యూస్‌టుడే: కాశీబుగ్గ పైవంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు విన్నవించారు. విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను శనివారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. జ్యోతి బాపులే గురుకుల పాఠశాల, పూండీలో జూనియర్ కళాశాల, పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత స్థలం, భవనాలు కేటాయించాలని, పూడిలంక వంతెన, మత్స్యకారులకు వలసలు నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట జనసేన నాయకులు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన వైకాపా కార్యకర్తలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : కవిటి మండలం బొరివంక గొనపపుట్టుగ గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకుడు గొనప సంతోష్ మరో 20 మంది వైకాపా కార్యకర్తలు శనివారం విజయదశమి సందర్భంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్ క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టుగలో తెదేపాలో చేరారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం పాలన తమకు నచ్చి తెదేపాలో చేరుతున్నామని తెలిపారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అశోక్

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడడమే తమ ధ్యేయమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఆదివారం కొత్తపుట్టుగ గ్రామంలో మండల పరిషత్తు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 లక్షలతో మోటర్ బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి, న్యూస్‌టుడే : కుల ధ్రువీకరణ పత్రాల సమస్యపై బెంతొరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షలు ఆదివారానికి 292వ రోజుకు చేరుకున్నాయి. కుల ధ్రువీకరణ పత్రాలు లేక మా పిల్లల భవిష్యత్తు అందకారంగా మరిందని తక్షణమే ప్రభుత్వం మా సమస్యను పరిష్కరించాలని బెంతొరియాలు కోరుతున్నారు.

నాడు ఉపాధికి నిలయం.. నేడు నిర్వీర్యం



కూల్చేసిన గోదాములు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పాలకులకు పట్టని రవాణా రంగ కేంద్ర నిర్వాహణ

ఉభయగోదావరి జిల్లాల నుంచి భువనేశ్వర్ వరకు యువతకు ఉపాధి దొరుకుతున్న ఇచ్ఛాపురం పట్టణంలో ఏఎస్‌పేటలోని రవాణా రంగ కేంద్రం. చదువులతో పనిలేకుండా వారి సామర్థ్యంతో ఇక్కడ ఉపాధి లభించేది. సుమారు 550 రవాణా కంపెనీలు, 400 వరకు లారీ సరఫరా కార్యాలయాలు, ఇతర అనుబంధ సంస్థలు, వేల సంఖ్యలో వ్యాపార కేంద్రాలు ఉండేవి. నిత్యం రూ.కోట్లలో లావాదేవీలు జరిగేవి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలమందికి ఉపాధిని అందించిన కేంద్రం ఇదే. 1965లో ఐదు సంస్థలతో ప్రారంభమైన ఈ కేంద్రం క్రమంగా ఎదిగింది. దేశంలో కేంద్రీకృత రవాణారంగ కేంద్రంగా రెండోస్థానం పొందింది. నాడు వెలుగులు విరజిమ్మిన కేంద్రం.. నేడు అంధకారంలోకి జారుకొంది. ఇప్పుడు గోదాములన్నీ కూలిపోయినం, శిథిలావస్థలో ఉన్నాయి. వాటిపై పురపాలకసంఘం వేసే పన్ను భారం భరించలేక, గోదాములు, భవనాలను కూల్చేసిన పరిస్థితి ఏర్పడింది.



శిథిలావస్థలో ఆర్థిక లావాదేవీల కేంద్రం..

గత పాలకుల నిర్లక్ష్యం

పురపాలకసంఘంలో మూడోవార్డుగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతంపై ఐదేళ్లుగా నిర్లక్ష్యం చేశారు. రవాణా రంగాన్ని ఆదుకోవాలనే యోచన గత పాలకులు చేయలేదని విమర్శలున్నాయి. సరకులను ఐదారు రాష్ట్రాలను దాటించి గమ్యానికి చేర్చే నాలుగు వరుసల జాతీయ రహదారి ఏర్పడటంతో ఇక్కడ కేంద్రం దెబ్బతింది. అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఇచ్ఛాపురంలో ఐటీఐను నెలకొల్పేందుకు రంగం సిద్ధమయ్యింది. ఎంపీడీవో ఆధ్వర్యంలో స్థల పరిశీలన, ఏఏ అంశాలపై శిక్షణ ఇవ్వవచ్చుననేది సాంకేతిక అధికారుల బృందం అధ్యయనం చేశారు. ఈ లోగా ప్రభుత్వం మారడంతో ప్రతిపాదన పడకేసిందని గ్రామస్థులు తెలిపారు.

దృష్టి సారించాలి..

ఇచ్ఛాపురం రవాణారంగ కేంద్రం అంటే ఒకప్పుడు ఎంతో ఉత్సాహం ఉండేది. కుటుంబాన్ని పోషించుకోవాలనుకుంటే ఈ ప్రాంతీయులకు జీవనం సాగా ఉండేది. కారణాలు ఏమైనా, పాలకుల నిర్లక్ష్యంతో కేంద్రం నిర్వీర్యమైంది. తెదేపా ప్రభుత్వం ఐటీఐ పెట్టేందుకు ప్రతిపాదించిన గత వైకాపా సర్కారు కనీస పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలి. -సీనియర్ ఉద్యోగి, రవాణారంగకేంద్రం, ఇచ్ఛాపురం

ముఖ్యమంత్రి దృష్టికి..

ఇచ్ఛాపురంలో యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం అవసరం. అందుకు రవాణారంగ కేంద్రం అనువుగా ఉంటుందని గతంలో ప్రతిపాదించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడుల సహకారం తీసుకుంటా.
-బెందాళం అశోక్ ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

బహుభాషాకోవిదుడు సాయిబాబా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: బహుభాషాకోవిదుడు, మహామేధావి దివంగత ప్రొఫెసర్ సాయిబాబా అని బీఎస్పీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వేదవర బిసాయి అన్నారు. ఆయన మృతి ఎంతో బాధాకరమైన విషయమని పేర్కొన్నారు.

మొక్కలు నాటాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్.ఎండుదొర అన్నారు. పలాస మండలం కొత్తపూరులో ఆదివారం మొక్కలు నాటారు. క్లబ్ కార్యదర్శి టి.మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మురుగు నీటి కాలువలు అధ్వానం



వజ్రపుకొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లోని మురుగునీటి కాలువల్లో చెత్త తొలగించకపోవడంతో పలు చోట్ల మురుగు నిలిచింది. దోమలు విజృంభిస్తుంటంతో ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రెయ్యిపాడులో ఈ పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఇక్కడ పాతరెయ్యిపాడులోని రెండు వీధుల పెరటాల మురుగునీటి కాలువలు నెలల తరబడి పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. తక్షణమే మురుగు నీటి కాలువలు శుభ్రపరచాలంటూ స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మోహని మాట్లాడుతూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

మెష్‌లు ఏర్పాటు చేయరూ..

మందస మండలం చినకోష్టలోగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో డార్మిటరీ, తరగతి గదుల కిటికీల మెష్‌లు చిరిగి పాడయ్యాయి. రోజు రాత్రి సమయంలో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దోమల విజృంభణతో పిల్లలు తరచూ జ్వరాల బారిన పడుతున్నారని బాలికల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త మెస్‌ల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులతో మాట్లాడతామని హెచ్ఎం తిరుపతిరావు తెలిపారు.



– న్యూస్‌టుడే, మందస

నెలలుగా పేరుకుపోయి



కంచిలి మండలం మఠం కంచిలి నుంచి సోంపేట వైపు వెళ్లే రహదారి పక్కన చెత్త, మాంసం దుకాణదారులు పడేసిన వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆ మార్గంలో ప్రయాణించే వారు శ్మశానం వద్దకు వచ్చే సరికి దుర్వాసన వ్యాపిస్తుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాంబాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్యపై స్థానికులతో చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

దుర్వాసన భరించలేకున్నాం..

పలాస ఆర్టీసీ డిపో సమీపంలో మురుగునీరు విడిచిపెడుతుంటంతో దుర్వాసనతో ఉండలేకపోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివాజీనగర్ ప్రాంతంలోని మురుగునీటిని ప్రహరీగోడకు రంధ్రం పెట్టి వదిలేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై డిపో తరపున పురపాలక కమిషనర్‌కు లేఖ ఇస్తే అనుమతి తీసుకుని కాలువల్లో పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పారిశుద్ధ్య విభాగ హెల్త్ అసిస్టెంట్ శేఖర్ తెలిపారు.
– న్యూస్‌టుడే, పలాస



గుంతల రహదారిలో ఇక్కట్లు



వజ్రపుకొత్తూరు మండలం పూండి బస్టాండ్ వద్ద మూడు రోడ్ల కూడలి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో మరుగుదొడ్ల నీరు చేరి స్థానికులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు గుంతల్లో చిక్కుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ తిరుమలరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్య ద్వారానే మనిషి పురోగతి సాధిస్తాడని, విద్యావంతులు ప్రపంచంలో ఎక్కడైనా గుర్తింపు సాధిస్తారని సోంపేట సివిల్ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి డి.చిరంజీవులు, సబ్ ట్రెజరీ అధికారి బి.కల్యాణ చక్రవర్తి అన్నారు. శయన చైతన్య దీపిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 24 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం, జ్ఞాపిక, ప్రశంశ పత్రాలు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు దేవాడ మోహనరావు, కార్యదర్శి దుద్ది వీర్రాజు, బీన ఆనంద్, పొడుగు కామేష్, బల్ల జానకిరావు, బంజు లోకనాథం పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

క్విజ్ పోటీల విజేత లండారిపుట్టుగ

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఇచ్ఛాపురం మండలం బూర్జపాడులో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో కవిటి మండలం లండారిపుట్టుగ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విజేతగా గెలిపొందింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు, టెక్కలి మండలం పూండీ జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త దాసరి రాజులు బహుమతులు అందజేశారు.



బహుమతులతో విజేతలు, అతిథులు

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం



పలాస రైల్వేకాలనీ సీతారామాలయంలో దుర్గాదేవిని నిమజ్జనం కోసం తీసుకుని వెళుతున్న యువకులు

పలాస, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస రైల్వేకాలనీలో సీతారామాలయంలో తొమ్మిదిరోజుల పాటు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ఆదివారం సాయంత్రం వాహనంలో అమ్మవారి ప్రతిమను ఊరేగించి సమీపంలో చెరువులో నిమజ్జనం చేశారు. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో దుర్గాదేవి ప్రతిమలను నిమజ్జనం చేశారు. ★ విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం స్వేచ్ఛావతి అమ్మవారి సన్నిధిలో వాహన పూజలు పెద్ద ఎత్తున జరిపించారు. ★ వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి, డోకులపాడు, బైపల్లి గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయ నృత్యాల మధ్య దేవి విగ్రహాల ఊరేగింపు చేపట్టారు.



స్వేచ్ఛావతి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



వజ్రపుకొత్తూరు గ్రామీణం: కొమరల్తాడలో కుంకుమ పూజల్లో మహిళలు

భక్తిశ్రద్ధలతో గాయత్రి ఉత్సవం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని నీలాపువీధిలో నిర్వహిస్తున్న గాయత్రీ దేవి 34వ వార్షిక నవరాత్రి ఉత్సవాలు వేడుకగా ముగిసాయి. పది రోజులుగా నిత్య పూజలు, అన్నప్రసాద వితరణ వివిధ కార్యక్రమాలతో సాగిన ఈ ఉత్సవాలను భక్తులు శనివారం రాత్రి అగ్నియాత్రతో ముగించారు. గాయత్రీ గురుస్వామి ఉలాసి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని పూజించి, నిప్పుల పై నడక యాత్రను చేశారు. తొలుత గురుస్వామి నడువగా, ఆయన వెంటన భవానీ మాలధారులు ఇతర భక్తులు తమ నడిచి అగ్నియాత్రను పూర్తి చేశారు.



నిప్పులపై నడుస్తున్న భక్తుడు

క్రికెట్ పోటీల విజేత కాశీబుగ్గ

పలాస, న్యూస్‌టుడే: పలాస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయి సేవకుల యూనిట్ క్రికెట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం మందిర ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, జిల్లా యూత్ లీడర్ శివకుమార్, పలాస, కాశీబుగ్గ సేవాసమితి కన్వీనర్లు సాయి సేవకులు పాల్గొన్నారు.



క్రికెట్ విజేతలతో సత్యసాయి సేవాసమితి సభ్యులు

శిర్డీసాయికి అన్నాభిషేకం



పలాస రైల్వేకాలనీ, శివాజీనగర్ శిర్డీసాయి ధ్యానమందిరాల్లో సాయి బాబా విగ్రహాలకు అన్నాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. బాబా పుణ్యతిధి ఉత్సవాల్లో భాగంగా జంటపట్టణాల్లో ఇంటింటీ నుంచి తెచ్చిన బియ్యం అన్నంగా వండి అనంతరం అభిషేకం జరిపించారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు సాయి నామ స్మరణ సంకీర్తన చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వేకాలనీ శిర్డీ సాయి ధ్యానమందిరం కార్యదర్శి జి.కె.ఎస్.రెడ్డి, శివాజీనగర్ ట్రస్ట్ నిర్వాహకుడు దువ్వాడ శ్రీదర్, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

మట్టిదారులకు మోక్షమెప్పుడు?



నెమలి-నారాయణపురానికి వెళ్లే రోడ్డు

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ, పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని పలు ప్రాంతాలకు ఇప్పటికీ సరైన రహదారులు లేవు. పట్టణం పరిధిలో ఉన్నా.. పల్లెల రహదారులు కంటే అధ్వానంగా తయారయ్యాయి. పాలకవర్గాలు మారుతున్నా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన మాత్రం జరగడం లేదు. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన మట్టి దారులే దర్శనమిస్తున్నాయి.

పట్టణ ప్రాంతంలో ఉన్నా..

పురపాలక సంఘంలో పారిశ్రామికవాడ నుంచి నెమలి-నారాయణపురం, రైల్వే గేటు నుంచి నర్సిపురం కాలనీ, తాళభద్ర నుంచి నర్సిపురంనకు వెళ్లే దారులన్నీ మట్టి రహదారులే. వీటితో పాటు సూది కొండ, శారదానగర్, సూర్యా కాలనీ, నేతాజీనగర్, అన్నపూర్ణ ఆశ్రమం, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల వీధుల్లో రోడ్లతో పాటు కాలువలు సైతం లేవు. దీంతో చిన్నపాటి వర్షానికి ఆయా ప్రాంతీయులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకుంటోంది. పట్టణం నడిబొడ్డున ఉన్న వార్డుల పరిధిలో అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ ఆ మేరకు అభివృద్ధి పనులు మాత్రం చేయడం లేదు.

దశాబ్దాలుగా చరిత్ర..

పురపాలక సంఘం ఏర్పడి దశాబ్దాల చరిత్ర ఉన్నా.. పలు ప్రాంతాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయార్తెంది. పాలకులు, అధికారులు ఆయా ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది.

ప్రతి పాదనలున్నాయి..

పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు చేసేందుకు ఇటీవల ప్రతిపాదనలు తయారు చేశాం. ప్రాధాన్యం ఉన్న పనులు చేయడం జరుగుతుంది.. పలు పనులు చేసేందుకు ఇటీవల కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది.
- కనకరాజు డీఈ, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం



నర్సిపురం కాలనీ రహదారి పరిస్థితి

ఎస్‌జీఎఫ్ యువకుల రక్తదానం



కవిటి మండలం బెలగాంలో ఎస్‌జీఎఫ్ సభ్యుడు దూపాన సునీల్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు రక్తదానం చేశారు. ఇప్పటి వరకు వివిధ సందర్భాల్లో 37 సార్లు ఎస్‌జీఎఫ్ సభ్యులు రక్తదానం చేసి అత్యవసర సమయాల్లో ఉన్నవారిని ఆదుకున్నారని సంస్థ సభ్యులు తెలిపారు. బెలగాం గ్రామ యువకులు, ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు, ఉద్దానం బ్లడ్ బ్యాంక్ యాజమాన్యం పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

సుజలధార వృథా అరికట్టారు

స్పందనకు వందనం

హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందస మండలం సువర్ణాపురం సమీపంలో సుజలధార పైపు నుంచి తాగునీరు వృథా అవ్వడంతో రహదారిపై నీరు నిలిచి అధ్వానంగా మారింది. ఈ పరిస్థితిపై ఈ నెల 8న 'సుజలధార వృథా' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన వార్తపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. పైపు లైను వృథాను పరిశీలించి శనివారం మరమ్మతులు చేపించి నీటి వృథాను అరికట్టారు.

పాలిథీన్ వ్యర్థాలతో చిక్కులు



వజ్రపుకొత్తూరు మండలం చినవంక, బాతుపురం, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి, బైపల్లి, గుణుపల్లి గ్రామాల్లో రహదారుల వెంట పెద్దఎత్తున పాలిథిన్ వ్యర్థాలు పేరుకుపోయాయి. మిగిలిపోయిన ఆహారంతో కలిపి పడేస్తుండటంతో మూగ జీవాలు తింటున్నాయి. చెత్తను నిర్వాహకులు గొయ్యి తీసి పాతేలా అధికారులు చొరవ చూపాలని పశు పోషకులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రమేష్‌నాయుడిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించి ప్లాస్టిక్ విక్రయాల నియంత్రణపై దృష్టి పెడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

? నరేంద్రపురం కూడలి నుంచి కొండపేట, వల్లభరాయపాడు వరకు ఉన్న బీటీ రహదారి గుంతలు ఏర్పడి పూర్తిగా అధ్వానంగా మారింది. నూతన రహదారి నిర్మాణం చేపట్టాలి.
- ఈశ్వరరావు, కొండపేట

• ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే రహదారి నిర్మిస్తాం
- మోహన్, ఏఈ, పీఐయూ, నందిగాం
– న్యూస్‌టుడే, నందిగాం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో ‘ఈనాడు’ మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

కుళాయిలు అమర్చారు.. నీరు సంగతి..?



పోలాకి మండల పరిధిలోని చినకోడూరు గ్రామంలో మూడు నెలల క్రితం కుళాయిలు అమర్చారు. తాగునీటి సరఫరాను మాత్రం అధికారులు పట్టించుకోక పోవడంతో అవి దిష్టిబొమ్మల్లా మిగిలాయి. దీంతో మంచినీటికి రోజూ కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామం జల్‌జీవన్ మిషన్ పథకానికి ఎంపికైందని చెప్పారు. త్వరలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

అచ్చెన్న వినతుల స్వీకరణ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: మండలంలోని నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజల నుంచి ఆదివారం వినతులు స్వీకరించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

వేణుగోపాలుని సేవలో జిల్లా న్యాయమూర్తి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని మెళియాపుట్టిలో కొలువైన రాధాకాంత గోవింద స్వామి(వేణుగోపాల స్వామి) ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం జిల్లా 4వ అదనపు న్యాయమూర్తి మహేంద్ర ఫణి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గోపినాథ్ రథో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

‘పల్లె పండగ’ విజయవంతం చేయాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ‘పల్లె పండగ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్‌పండా, ఏపీవో టి.రవి కోరారు. మండలంలో సోమవారం బాణాపురం, ముకుందపురం, జాడుపల్లి పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

అభివృద్ధికి బాటలు..!

న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

టెక్కలి పట్టణంలోని పేదల కాలనీల్లో రహదారులకు మోక్షం లభించనుంది. ఇటీవల రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు అయ్యప్పనగర్, భవానీనగర్, మండాపొలం కాలనీల్లో పర్యటించారు. అక్కడ రహదారులు, కాలువల నిర్మాణానికి పలు సూచనలు చేశారు. ఇచ్చిన మాట మేరకు అభివృద్ధి పనుల అంకురార్పణకు ఆయన యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. దీంతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఆయా ప్రాంతాల్లో కాలువలు, సిమెంటు రహదారుల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. కలెక్టర్ అనుమతి కోసం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసింది. రూ.4.15 కోట్లతో 17 పనులు చేపట్టనున్నారు.



పనులు చేపట్టనున్న భవానీనగర్- అయ్యప్పనగర్ రహదారి

ప్రధాన మార్గాల అనుసంధానం

జాతీయ రహదారికి ప్రధాన మార్గాలను అనుసంధానం చేస్తూ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ప్రధానంగా అయ్యప్పనగర్, భవానీనగర్ మీదుగా రహదారిని 40 అడుగుల మేర విస్తరించేందుకు నిర్ణయించారు. రెండు వైపులా కాలువల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు నాలుగు భాగాలుగా విభజించి రూ.45 లక్షల చొప్పున పనులు ప్రారంభిస్తారు. రూ.1.80 కోట్ల విలువైన ఈ పనులతో ఆ ప్రాంతం రూపురేఖలే మారనున్నాయి. భవానీనగర్‌లో సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణానికి రూ.20 లక్షలు వినియోగించనున్నారు.

రూ.4.15 కోట్లతో ప్రతిపాదనలు

మండాపొలం కాలనీలోనూ ప్రధాన రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ప్రతి వీధి పురోగతికి 10 పనులను ప్రతిపాదించారు. అన్ని వీధుల్లో సిమెంటు రహదారులు, కాలువలు నిర్మించనున్నారు.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం

అయ్యప్పనగర్, భవానీనగర్‌లో రాష్ట్రమంత్రి పర్యటనతో సూచించిన పనులను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. జిల్లా కలెక్టర్ అనుమతించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.
– చింతాడ లక్ష్మీబాయి, ఎంపీడీవో, టెక్కలి

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

టెక్కలి, న్యూస్‌టుడే: టెక్కలి- బన్నువాడ రహదారిలో నంబాళ్లపేటకు చెందిన పి.రామకృష్ణ, ఆయన భార్య దీపిక ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మోదుగువలసకు చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలవడంతో వారికి జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, శ్రీకాకుళం తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ...

టెక్కలి- లింగాలవలస రహదారిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న క్రాంతిలాల్, తావడ్ సింగ్ లింగాలవలస వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయాలు పాలైన వీరిని టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అందించి, శ్రీకాకుళం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు విశాఖపట్నం తరలించారు.

లారీ పైనుంచి వెళ్లిపోవడంతో..

కోటబొమ్మాళికి చెందిన గున్న అప్పన్న శనివారం ద్విచక్రవాహనంపై టెక్కలి వస్తుండగా డిగ్రీ కళాశాల సమీపంలో అదుపు తప్పి పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఆయన కాలుపైనుంచి వెళ్లిపోవడంతో కాలు నుజ్జయింది. జిల్లా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, శ్రీకాకుళం తరలించారు.

వంతెన.. తీరని యాతన..!



రెండు రాష్ట్రాలను కలిపే మాతల- నివగాం వంతెనపై రహదారి దుర్భరంగా మారింది. పలుచోట్ల గోతుల్లో ఇనుప ఊచలు బయటకు దర్శనమిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాలు తిరిగే మార్గంలో పరిస్థితి ఇలా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. సమస్యపై ఆర్అండ్‌బీ ఏఈ కిరణ్ మాట్లాడుతూ నిర్వహణ పనుల్లో వంతెనపై రహదారిని మెరుగు పరుస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

కాలువలు శుభ్రం చేయరూ..!



ఎల్ఎన్‌పేట మండలం మోదుగువలస పునరావాస కాలనీలో కాలువలు పూడికతో నిండిపోయాయని స్థానికులు వాపోతున్నారు. మురుగు నిలిచి పోతుండటంతో దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పంచాయతీ సిబ్బందితో కాలువలు శుభ్రం చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

మూడేళ్లుగా నత్తతో పోటీ



పోలాకి మండల పరిధిలోని పల్లిపేట గ్రామంలో మూడేళ్ల కిందట ప్రారంభించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో సిబ్బంది పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ఇబ్బందులు తీర్చాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో జి.వి.రవికుమార్ మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలపై ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

పక్కనే ముప్పు.. కలగదా కనువిప్పు



నందిగాం మండలం పెద్దతామరాపల్లి- గొల్లపూరు రహదారి పక్కన రెండు గ్రామాల మధ్య ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు అల్లుకుపోయాయి. ఈ మార్గంలో నిత్యం ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు చేస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి రక్షణ కంచె ఏర్పాటు చేస్తామని ఏఈ నేతాజీ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

అవినీతిమయం.. నాణ్యత మాయం

పోలాకి మండలం ప్రకాశరావుపేట మీదుగా ఆరు నెలల కిందట వేసిన రోడ్డు గోతులమయంగా మారింది. అప్పట్లో రూ.2 కోట్లతో ప్రియాగ్రహారం నుంచి సంతబొమ్మాళి మండలం నౌపడ వరకు రహదారి నిర్మించారు. మూలపేట పోర్టు పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు తిరుగుతుండటంతో మార్గం ధ్వంసమవుతోంది. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ హరినాథ్ మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పోలాకి



భక్త నీరాజనం..!



కొత్తూరులోని ఓంశాంతి కేంద్రంలో..



పాతపట్నం: భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



టెక్కలిలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న అమ్మవారి విగ్రహాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ఘనంగా ముగిశాయి. చివరి రోజు విజయదశమి సందర్భంగా శనివారం టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. వాహనాలను పూలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
– న్యూస్‌టుడే బృందం



నరసన్నపేట: నృత్యాలు చేస్తున్న కళాకారులు



నరసన్నపేట గ్రామీణం: ఉర్లాం గ్రామంలో..

కీళ్లనొప్పులతో సతమతం



బూరగాంలో నొప్పులతో బాధపడుతున్న వృద్ధురాలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: విష జ్వరాల నుంచి తేరుకుంటున్న బూరగాం పంచాయతీలో ప్రజలు కీళ్ల నొప్పులతో సతమతం అవుతున్నారు. నెల రోజుల క్రితం ఈ గ్రామంలో తీవ్రస్థాయిలో జ్వరాలు ప్రబలడంతో లింగాలవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో పలుమార్లు శిబిరాలు ఏర్పాటుచేసి సేవలందించారు. జ్వరాలు వీడినా కీళ్లనొప్పులు మాత్రం వేధిస్తున్నాయని పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సమస్యపై లింగాలవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు పవన్‌తేజ మాట్లాడుతూ జ్వరాలు తగ్గాక నొప్పులు సహజంగా వస్తాయన్నారు. సమస్యలున్న వారు తప్పనిసరి పరిస్థితుల్లో నొప్పి నివారణ మందులు వినియోగించాలన్నారు.

హైకోర్టు పీపీకి సన్మానం



లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ సభ్యులు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: హైకోర్టు పీపీ మెండ లక్ష్మీనారాయణ స్వగ్రామం కృష్ణచంద్రపురం రావడంతో కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, తిరుమలరావు, పల్లి వాసుదేవరావు, పూజారి వాసుదేవరావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం



జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వర స్వామి గ్రామోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి, ఆలయ ధర్మకర్త పర్లాఖెముండి మహారాజు పేరున అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులతో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

టెట్‌కు 62మంది గైర్హాజరు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 62 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. స్థానిక కోర్ టెక్నాలజీ సెంటర్‌లో ఆదివారం జరిగిన పరీక్షలకు మొత్తం 660 మందికి గానూ 598 మంది హాజరయ్యారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండల పరిషత్తు సమావేశ భవనంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరుగుతుందని ఎంపీడీవో మోహన్‌కుమార్ తెలిపారు. ఈ సదస్సుకు పాతపట్నం న్యాయస్థానం జూనియర్ సివిల్ జడ్జి హాజరవుతున్నారని, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొనాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో తంప వాసి ప్రతిభ

హిరమండలం, పాతపట్నం, న్యూస్‌టుడే: హిరమండలంలోని తంప గ్రామానికి చెందిన గులివిందల నేతాజీ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 4 నుంచి 6 వరకు రాజమహేంద్రవరంలో జరిగిన పోటీల్లో పురుషుల అండర్- 20 విభాగంలో షాట్‌పుట్‌లో స్వర్ణం సాధించగా, డిస్కస్‌త్రోలో రజతం దక్కించుకున్నారు. దీంతో ఈ నెల 24న జరగనున్న సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈయన ఆంధ్ర వైద్య కళాశాల విశాఖపట్నంలో మూడో సంవత్సరం (ఎంబీబీఎస్) చదువుతున్నారు.

అక్రమంగా మద్యం విక్రయం.. వ్యక్తి అరెస్టు

సారవకోట, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మండలంలోని అలుదు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి శనివారం పాతపట్నం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ బి.అనీల్‌కుమార్ తెలిపారు. ఆయన నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మేదరి వీధికి చెందిన తెల్లి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.అనీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల 12న జరిగిన గొడవలో తెల్లి రామారావు, తిరుపతిరావు, అప్పలమ్మ, శ్రీను, ఆకాశ్, మనోహర్, రామచంద్రరావు తనపై దాడి చేసి గాయపరిచారని వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాధితుడిని వైద్యసేవల కోసం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సిబ్బంది పనితీరుపై ఆర్డీవో ఆగ్రహం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తపేటలోని సామాజిక ఆసుపత్రిలో సిబ్బంది పనితీరుపై టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సామాజిక ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది విధుల్లో లేకపోవడం, ఆసుపత్రిలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించిన ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముగ్గురు వైద్యులకు కేవలం ఒక్కరే ఉండటంపై ప్రశ్నించారు. అనంతరం దస్త్రాలు పరిశీలించారు.

కాలువలో పడి స్వల్ప గాయాలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: బలగలోని కాలువలో ఓ వ్యక్తి ఆదివారం మద్యం మత్తులో పడిపోయారు. టెక్కలికి చెందిన ఓ మీడియా ప్రతినిధి, స్థానికులు చూసి బయటకు తీశారు. స్వల్పగాయాలతో బయట పడ్డారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

పలాస క్రీడలు: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కుప్పిలి నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వెంటనే కళాశాలలో వారి పూర్తి వివరాలతో పత్రాలను సమర్పించాలన్నారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు జరగనున్న ముఖాముఖి పరీక్షకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

తెలంగాణ డీఎస్సీలో ప్రతిభ

కొత్తూరు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీలో కొత్తూరులోని దేవరవీధికి చెందిన రుద్రపంక్తి సంతోష్‌కుమార్ ప్రతిభ చూపాడు. ఈ యువకుడు ఎస్జీటీ విభాగంలో ఖమ్మం జిల్లాకు సంబంధించి 10వ ర్యాంకు సాధించాడు. తండ్రి మల్లేశ్వరావు కొత్తకొత్తూరు శివాలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. తల్లి శైలజ గృహిణి. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

క్రీడా బరి.. పతకాలపై గురి

కబడ్డీ అంటే ఇష్టం



కబడ్డీ ఆట అంటే చాలా ఇష్టం. పాఠశాలలో వ్యాయామోపాధ్యాయుడు చంద్రశేఖరరావు సూచనలు పాటిస్తుంటాను. అండర్- 14 విభాగంలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు మా పాఠశాల నుంచి ఎంపికయ్యాను. చాలా ఆనందంగా ఉంది. – వాన చంద్రరావు, 9వ తరగతి, యలమంచిలి ఉన్నత పాఠశాల

బంగారు పతకమే లక్ష్యం



ఇటీవల జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో పరుగు పందెంలో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. మా ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఇతర ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు. జాతీయ స్థాయిలో పరుగు పందెంలో బంగారు పతకం సాధించడమే లక్ష్యం. – డి.భాను, ఇంటర్, ఈదులవలస ఆదర్శపాఠశాల

చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో యలమంచిలి ఉన్నత పాఠశాల, పోలాకి మండలం ఈదులవలస ఆదర్శ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది సత్తాచాటారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల అయిన తర్వాత సాయంత్రం కొంత సమయాన్ని ఆటలకు కేటాయిస్తూ క్రీడాకారులకు తర్ఫీదు ఇస్తున్నట్లు వ్యాయామోపాధ్యాయులు నీలంనాయుడు, చంద్రశేఖరరావు చెబుతున్నారు. దీనిపై ‘న్యూస్‌టుడే’ కథనం.



కరవంజ ఆదర్శ పాఠశాల ఆవరణలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయిలో సత్తా చాటుతా



మారుమూల గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించాను. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో లాంగ్‌జంప్, పరుగు పందెంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. వ్యాయామోపాధ్యాయుడు నీలంనాయుడు శిక్షణతో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతానని దృఢమైన నమ్మకం వచ్చింది.
– పూడి ఝాన్సీ, 7వ తరగతి, ఈదులవలస ఆదర్శ పాఠశాల

ప్రత్యేక సమయం కేటాయిస్తాం

ఆటల వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం పెరిగి ఆరోగ్యంతో పాటు ఆలోచనాశక్తి మెరుగుపడుతుంది. సాయంత్రం సమయంలో ఆటల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చేలా మా పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు నిరంతరం కృషిచేస్తున్నారు.
– పైడి ప్రవీణ, ప్రధానాచార్యులు, ఈదులవలస ఆదర్శపాఠశాల
– గొద్దు రఘునాథరావు, ప్రధానోపాధ్యాయుడు యలమంచిలి

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన పొన్నాన శ్రీను ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు ఇంటర్ కలిసి చదువుకున్న స్నేహితులు సమకూర్చిన రూ.28 వేలు నగదును సర్పంచి దుక్క భూషణ్‌రెడ్డి ఆదివారం అందజేశారు.

గణిత శాస్త్రంలో డాక్టరేట్

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: మండలంలోని వడ్డివాడ గ్రామానికి చెందిన ఎన్.జగన్నాథం గుణపూర్‌లోని జీఐఈటీ విశ్వవిద్యాలయం ఉప కులపతి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈయన గణితశాస్త్రంలో చేసిన పరిశోధనలకు గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా వడ్డివాడ గ్రామస్థులు, కుటుంబ సభ్యులు జగన్నాథంను అభినందించారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు



విజేతలతో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు, ఇతర నాయకులు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఇచ్ఛాపురం మండలం బూర్జపాడులో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో కవిటి మండలం లండారిపుట్టుగ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విజేతగా గెలిపొందింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు, పూండి జట్టు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త దాసరి రాజు బహుమతులు అందజేశారు.

తెరపై ఈనాడు

★ కీర్తన: **రామ్‌నగర్ బన్నీ** ★ కీర్తిక: **సత్యం సుందరం** ★ కిన్నెర సినీమాక్స్: **దేవర** ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): **వేట్టయన్** ★ సూర్యమహల్: **విశ్వం** ★ సరస్వతి: **దేవర** ★ చంద్రమహల్: **జనక అయితే గనక** ★ మారుతి: **మా నాన్న సూపర్ హీరో** – న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఉత్తమ తృతీయ ప్రదర్శనగా మతమా.. మానవత్వమా

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కళల కాణాచి (తెనాలి), వేద గంగోత్రి ఫౌండేషన్ (విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి చేపట్టిన వీణా పురస్కారాలు, నాటకోత్సవాలు-2024, ఎ.ఆర్.కృష్ణ, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జాతీయ స్థాయి సమకాలీన పద్య నాటక వ్యక్తిగత బహుమతులు, సాంఘిక నాటక, నాటిక పోటీల విజేతలను వేర్వేరుగా ప్రకటించారు. నాటిక విభాగంలో చిగురు మేఘం (గుంటూరు అమరావతి ఆర్ట్స్) ప్రథమ, నా శత్రువుకు (హైదరాబాద్ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్) ద్వితీయ, మతమా.. మానవత్వమాకు (శ్రీకాకుళం లలిత శ్రీ కళాసమితి) తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి.

ప్రాచీన క్రీడలకు ఆదరణ పెరగాలి



తాళింఖానా క్రీడాకారులతో ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్, గార, న్యూస్‌టుడే: ప్రాచీన క్రీడలకు కర్రసాము, తాళింఖానాలకు ఆదరణ పెరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. శివతాలింఖానా వ్యాయామశాల ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కర్రసాము, తాళింఖానా ఆత్మరక్షణ విద్యగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రాచీన గ్రామీణ క్రీడలు రోజురోజుకు కనుమరుగవుతున్నాయని.. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నేడు చదువుల పోటీల్లో పడి చిన్నారులు ఈ ఆటలను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. ● గ్రామ స్థాయిలో ప్రథమ చికిత్సా కేంద్రాల అవసరత ఎంతో ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం అంపోలు పంచాయతీ పిలకవానిపేటలో శ్రీకృష్ణ మహిమాన్విత ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో సిక్కోలు సత్తా

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు మరోమారు సత్తాచాటారు. చండీఘర్ ముల్లన్‌పూర్‌లోని జట్టు తరపున బరిలో దిగిన క్రీడాకారులు హిమచల్ ప్రదేశ్ జట్టుపై చెలరేగి ఆడారు. జిల్లా క్రీడాకారులు రాజాన జున్నారావు 10ఓవర్లలో 41పరుగులు సాధించి 5వికెట్లు దక్కించుకున్నాడు. నంబాళ్ల సుశాంత్ 55బంతుల్లో 31పరుగులు సాధించాడు. జున్నారావు ఆటతీరును ఇండియా సెలక్టర్లు ప్రశంసించారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హసన్‌రజా, మెంటార్ ఇలియాజ్ మహ్మద్, కోశాధికారి కెఎస్ఎం షైలానీ, రవిచలం తదితరులు అభినందించారు.

పారిశుద్ధ్యం అధ్వానం.. అవస్థల్లో జనం..!

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు



సరుబుజ్జిలి: షళంత్రిలో రహదారి, కాలువలో పేరుకుపోయిన మురుగునీరు

వైకాపా ప్రభుత్వ పాలనలో పంచాయతీల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. కేంద్రం నుంచి నిధులు వస్తున్నా వాటిని దారి మళ్లించేసారు. గ్రామాల్లో ఆస్తులన్నా ఏమైనా సమస్యలు ఎదురైతే సర్పంచులే సొంత ఖర్చుతో భరించాల్సి వచ్చేది. ఇప్పటికే ఒక్కో సర్పంచి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అప్పులు చేశామని వాపోతున్నారు. చేసిన పనులకు బిల్లులు ఎప్పుడు అందుతాయో తెలియక అయోమయంలో తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, సీసీ రోడ్లు, కాలువలు, వీధి దీపాల వంటి ఏర్పాటు చేయలేక ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా పంచాయతీలకు తగిన నిధులను అందించి అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని పలువురు సర్పంచులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి

ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాలు ఉన్నాయి. వీటిలో 110 పంచాయతీలు ఉండగా 76 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. పంచాయతీల నిర్వహణకు గత ప్రభుత్వ పాలనలో వచ్చిన ఆర్థిక సంఘం నిధులను సర్పంచులకు తెలియకుండానే మళ్లించుకున్నారు. దీంతో పంచాయతీ ఖాతాలు ఖాళీ అయిపోయాయి. వీధి దీపం వెలగకపోతే కొత్తది వేసేందుకు చేతిలో చిల్లి గవ్వలేని పరిస్థితులు పంచాయతీల్లో నెలకొన్నాయి. గ్రామాల్లో ఇటీవల పారిశుద్ధ్య వారోత్సవాలను తూతూమంత్రంగానే నిర్వహించారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే నిలువ ఉండిపోవడంతో దుర్వాసన, దోమలతో నాలుగు మండలాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● వైకాపా ప్రభుత్వం ప్రతి గ్రామానికి హరిత రాయబారులు(గ్రీన్ అంబాసిడర్లు)ను నియమించింది. వీరు రోజూ వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరణతో పాటు కాలువల్లో పూడిక తీత పనులు చేయాల్సి ఉంది. ప్రభుత్వం వీరికి సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో విధులకు సరిగ్గా హాజరుకావడం లేదు. గ్రామ పంచాయతీతో పాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మలాథియాన్ ద్రావణం పిచికారీ చేయించాలి. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలి. గతంలో సచివాలయాలకు అందజేసిన ఫాగింగ్ యంత్రాలు వినియోగంలో లేక అట్టపెట్టెల్లోనే మూలుగుతున్నాయి.

నిధుల మేరకు పనులు చేయిస్తున్నాం

గ్రామ పంచాయతీల్లో నిల్వ ఉన్న నిధుల మేరకు అభివృద్ధి పనులు చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడిక, మురుగు నీరు తొలగింపు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేయించేందుకు కృషి చేస్తాం.

– బి.రామారావు గోపాలరావు, సింహాచలం, విజయలక్ష్మి, సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల ఈవోపీఆర్డీలు

సంగీత దర్శకుడికి సత్కారం



తెనాలిలో లీలామోహన్‌కు సత్కారం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన నంది పురస్కార గ్రహీత లీలా మోహన్ ఉత్తమ సంగీత దర్శకుడిగా తెనాలిలో అవార్డు అందుకున్నారు. రామకృష్ణకవి కళాక్షేత్రంలో అయిదు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సమకాలీన, సాంఘికనాటిక, పద్యనాటక పోటీల్లో విశాఖకు చెందిన న్యాయవాది పి.టి.మాధవ్ రాసిన 27వ మైలురాయి నాటకానికి సంగీత దర్శకత్వం వహించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఈ నెల 3వ తేదీ నుంచి జిల్లాలో మూడు కేంద్రాల్లో జరుగుతుంది. ఎచ్చెర్ల మండలంలో ఆదివారం శివాని, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. శివానిలో 340 మందికి 309, శ్రీవెంకటేశ్వరలో 101 మందికి 93 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ నెల 21 వరకూ ఈ పరీక్షలు కొనసాగనున్నాయి.

జాతీయ స్థాయి పోటీల్లో రెండు పతకాలు



శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గార మండలం అంపోలు గ్రామం ఆడవరం గ్రామానికి చెందిన **గుజ్జల వర్షిత** రెండు పతకాలు సాధించింది. ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వర్షిత నేషనల్‌లో స్నాచింగ్‌లో 81కేజీలు, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 100కేజీలు బరువులు ఎత్తి యూత్ విభాగంలో స్వర్ణం, జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు శ్రీకాకుళం జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇంజరాపు భాస్కరరావు, కొత్తకోట శ్రీనువాసరావు తెలిపారు. విజేతలకు శిక్షకులు ఇప్పిలి అప్పన్న, గుజ్జల హిమగిరి తదితరులు అభినందించారు.

తాగునీరు వృథా

భైరివానిపేటకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైను స్థానికంగా ఓ దాబా సమీపంలో మరమ్మతులకు గురై కొద్ది రోజులుగా నీరు వృథా అవుతోంది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావును వివరణ కోరగా తక్షణమే మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



అల్లుకున్న నిర్లక్ష్యం..!



పొందూరు మండలం తోలాపి గ్రామంలో రహదారి పక్కన విద్యుత్తు మినీ నియంత్రిక (ట్రాన్స్‌ఫార్మర్)ను తీగలు, పనికిరాని మొక్కలు అల్లుకుపోయాయి. చేతికందినంత ఎత్తులో ఇది ఉండటంతో పాటు తీగలు, మొక్కలు అల్లుకుపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, విద్యుత్తుశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తుశాఖ జేఈ రమణమూర్తి వద్ద ప్రస్తావించగా రెండు రోజుల్లో తీగలు, పనికిరాని మొక్కలు తొలగించి శుభ్రం చేయిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

తప్పని పందుల బెడద



పొందూరు పట్టణంలో పందుల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. దీంతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మార్కెట్ ఆవరణలో రహదారిపై ఇవి గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఈ విషయమై పొందూరు మేజర్ పంచాయతీ ఈవో మోహన్‌బాబుతో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పందుల యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు

ఆదమరిస్తే ప్రమాదమే..!

మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి వెళ్లే రహదారి పక్కన పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహన చోదకులు దగ్గరకు వచ్చే వరకు గుర్తించలేకపోతున్నారు. దీంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



అవీ..ఇవీ..అన్నీ

మణిపాత్రుని సేవలు అభినందనీయం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరానికి చెందిన మణిపాత్రుని నాగేశ్వరరావుకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆమదాలవలస అందజేసిన ఉత్తమ సేవా అవార్డును ఎమ్మెల్యే గొండు శంకరరావు ప్రదానం చేశారు. సంగీతం, చిత్రలేఖనం, నృత్య మృదంగ కళల్లో ఈయన విశేష ప్రతిభ చూపడంతో ఈ ఘనత దక్కింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం జరిగింది.

ఇంటింటికీ వెళ్లి ఆరా..



ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి నారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలు ఇంటి వద్ద చదువుతున్నారా.. లేదా అని పరిశీలించడంతో పాటు తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువులపై శ్రద్ధ చూపాలని కోరారు.

పాదాల పోలమ్మ అమ్మవారికి పూజలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని షళంత్రి గ్రామంలో పాదాల పోలమ్మ అమ్మవారికి శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి వాహనాలను అమ్మవారి గుడి వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు.

కుప్పిలి కవితకు జాతీయ స్థాయి ప్రశంస

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలసకు చెందిన కవి, రచయిత కె.వి.రాజారావు ఆంగ్ల కవితకు జాతీయ స్థాయి ప్రశంస లభించింది. ఎస్-7 గూగుల్ సంస్థ జాతీయ స్థాయిలో సెప్టెంబర్ నెలలో ఆన్ లైన్ ద్వారా కవితా పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో కె.వి.రాజారావు రచించిన డార్క్ సీన్స్ (చీకటి దృశ్యాలు) అనే కవితకు ప్రశంస లభించిందని ఆయన తెలిపారు. కొరియర్ ద్వారా ఈ ప్రశంసాపత్రం ఆదివారం అందినట్లు పేర్కొన్నారు. సమాజంలో వికృత పోకడలపై రచించిన కవిత ఇది అని తెలిపారు.

వేలంలో కలశం కైవసం

పొందూరు, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని రాపాక గ్రామంలో దేవి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపం వద్ద అమ్మవారి కలశం వేలం పాటను నిర్వహించారు. ఇందులో కలశాన్ని గ్రామానికి చెందిన వండాన రిషిత రూ.63,500లకు కైవసం చేసుకున్నారు. ❖ సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో సూర్యనారాయణస్వామి ఆలయం వద్ద నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి తొమ్మిది అవతారాల్లో అలంకరించిన చీరలకు భవానీ భక్త కమిటీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. వేలం పాట దక్కించుకున్న మహిళలకు పంచాయతీ ఉప సర్పంచి పైడి నర్సింహ అప్పారావు, భవానీ భక్త కమిటీ సభ్యులు చీరలు అందజేశారు.



జూదరుల అరెస్టు

ఎచ్చెర్ల(రణస్థలం), శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: మండలంలోని చిల్లపేటరాజాం సమీపంలోని తోటల్లో జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం జేఆర్‌పురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4 వేలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. ❖ శ్రీకాకుళం నగరంలో ఆడంగివారివీధిలో జూదం ఆడుతున్న ఆరుగురిని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. సమాచారం దాడి చేసినట్లు వెల్లడించారు.

ఘనంగా దసరా వేడుకలు



పొందూరులో దుర్గాదేవిని ఊరేగిస్తున్న దృశ్యం



ఆమదాలవలసలో పాలపోలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, పొందూరు, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రులను భక్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆమదాలవలస లోని పాలపోలమ్మ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహానికి, మెట్టక్కివలసలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రతిమకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ దేవత పాలపోలమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రవికుమార్‌కు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, మొదవలస రమేష్, కూన అప్పలనాయుడు, పాతిన రమణమూర్తి, కూన భానూజీరావులతో పాటు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● ఆమదాలవలస పట్టణం, మెట్టక్కివలస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ● సరుబుజ్జిలి మండలంలోని వీరమల్లి గ్రామంలో దుర్గాదేవి అమ్మవారికి తిరువీధి నిర్వహించారు. భవానీ భక్తులు దీక్ష అనంతరం అమ్మవారిని గ్రామంలో డప్పులు, మేళాలతో ఊరేగించారు. ● పొందూరు మండలంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను ఊరేగించి ఘనంగా నిమజ్జనం చేశారు. పొందూరు పట్టణంలో వివిధ వీధులతో పాటు రాపాక, లక్ష్మింపేట, తండ్యాం తదితర గ్రామాల నుంచి విగ్రహాలను సమీప చెరువుల వద్దకు తరలించి నిమజ్జనం చేశారు.

'రావూరి' చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి చంద్రమౌళి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజాంలో కవులు, రచయితలు మృతి చెందినా వారు రచించిన కవితలు, రచనలు ఎల్లప్పుడూ ప్రజలకు గుర్తుంటాయని ఎల్ఎన్ పేట మండల విద్యాశాఖాధికారి కుప్పిలి చంద్రమౌళి అన్నారు. ఆదివారం ఆమదాలవలస పట్టణంలోని బి.ఆర్.నగర్‌లో విశ్వసాహితీ కళావేదిక అధ్యక్షుడు పొన్నాడ వరాహనర్సింహులు నిర్వహించిన రావూరి భరద్వాజ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి, రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత అయిన రావూరి భరద్వాజ్ చిరస్మరణీయుడని అన్నారు. ఆయన రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. కవి, ఉపాధ్యాయుడు పూజారి సూర్యనారాయణ, కవులు, రచయితలు బెండి గోవిందరావు, గురుబెల్లి కృష్ణారావు, తమ్మినేని సూర్యనారాయణ, నానుపాత్రుని చంద్రశేఖర్, విశ్వసాహితీ కార్యదర్శి కర్నేని జనార్ధనరావులతో పాటు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

కాలువలో పడి స్వల్ప గాయాలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: బలగ ప్రాంతంలోని కాలువలో టెక్కలికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం పడిపోయారు. ఓ మీడియా ప్రతినిధి చూసి బయటకు తీశారు. సదరు వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలం



మంద కృష్ణ మాదిగను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణరావు, విజయ్‌కుమార్

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మనమంతా ఐక్యతతో ఉన్ననాడే మన హక్కులను సాధించుకోగలమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని గాజులకొల్లివలస గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు నారాయణరావు కుమారుడి వివాహానికి వచ్చిన ఆయనను సంఘ నాయకుడు రాడా విజయ్‌కుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతోనే సత్ఫలితాలు సాధించుకోగలమన్నారు. అందరి సహకారంతోనే ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు భాస్కరరావు, కృష్ణంరాజులతో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆదిత్యుని కల్యాణం



ఏకాదశిని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉషా, ఛాయ, పద్మిని సమేత సూర్యనారాయణస్వామి వారికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ అర్చకులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ అర్చకుడు ఇప్పిలి సాందీపశర్మ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

గేటు పడితే నిరీక్షణే..!



పొందూరు రైల్వే స్టేషన్ వద్ద గేటు పడితే చాలు గంటల తరబడి వాహన చోదకులు నిరీక్షించాల్సి ఉంటోంది. ఈ రహదారిపై నిత్యం వందల మంది ప్రయాణికులు రాకపోకలకు సాగిస్తుంటారు. ఎప్పుడు గేటు పడుతుందోనని వారు భయపడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రధానంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ గేటు వద్ద నిరీక్షణ కారణంగా సకాలంలో పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాపోతున్నారు. రైల్వేశాఖ అధికారులు స్పందించి రైల్వే వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

సచివాలయానికి బోర్డు ఏదీ?



ఆమదాలవలస మున్సిపాలిటీ 22వ వార్డు లక్ష్ముడుపేటలోని సచివాలయానికి బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో సచివాలయం గ్రామంలో ఉండేదని, గ్రామం మొదట్లో కొత్తగా నిర్మించిన రేకుల షెడ్డులోకి మార్చేశారని, దీంతో కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయానికి బోర్డు లేకపోవడంతో ప్రజలు పాత సచివాలయానికి పనుల కోసం వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే బోర్డు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం